

కడియంలో ట్రైనీ కలెక్టర్ల పర్యటన

ప్రజాశక్తి-కడియం

కడియం మండలంలో ట్రైనీ కలెక్టర్లు పి.సువర్ణ, ఎం.భానుప్రకాష్ రెడ్డి బుధవారం పర్యటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, కడియం సచివాలయం-1, వేమగిరి సచివాలయం-4ను వారు సందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఏ విధంగా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయి, ఎదురయ్యే సమస్యలపై సచివాలయాల ఉద్యోగులను, గ్రామ వాలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్, చేదోడు, చేయూత, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వ లక్ష్యం ఎంతవరకు ప్రజలకు చేరుతుందోనని పరిశీలించారు. వేమగిరి సచివాలయంలో రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించారు. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా రిజిస్ట్రేషన్లు జరిగే తీరును ఆరా తీశారు.

రబీ గట్టెక్కేనా..?



- సాగునీటి లభ్యతపై అనుమానం
- రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
- నిధుల మంజూరుపై స్పష్టత కరువు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో రబీ గట్టెక్కేదెలా అనే ప్రశ్న వెంటాడుతోంది. ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామని అధికార యంత్రాంగ ఇటీవల ప్రకటించింది. నీటి లభ్యతపైనా అంచనాలు వేసి ప్రణాళికలు తయారు చేశారు. రబీ సాగుకు, తాగునీటి అవసరాలకు 92 టిఎంసిలు అవసరం కాగా గోదావరిలో దశలవారీగా 82 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని చెబుతున్నారు. అయితే అంతటి నీటి ప్రవాహం ఉంటుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులతో గోదావరిలో నీటి ప్రవాహం అంతగా లేదు. ఏటా ఆగస్టు నుంచి అక్టోబరులో నీటి ప్రవాహాన్ని బట్టి రబీలో లభ్యతను అంచనా వేస్తారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యాయి. శివారు ప్రాంతాలకు సాగునీరు అందలేదు. పంట పొలాలు దెబ్బతిన్నాయి. పురుషోత్తపట్నం, పుష్కర పంప్‌హౌస్ 1, 2లను నిధుల కొరత వేంటాడుతోంది. రబీలో వంతుల వారీ విధానంతో గట్టెక్కవచ్చంటూ ముందుగానే ప్రణాళికలు వేసుకుంటున్నారు. అంచనాలు తలకిందులైతే పరిస్థితి ఏమిటనే ఆందోళన వెంటాడుతోంది. అధికారుల గణాంకాల ప్రకారం సీలేరు నుంచి 40 టిఎంసి నీరు లభించనుంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా సీలేరు నుంచి ప్రతి ఏటా ఆ మేరకు నీటి లభ్యత ఉంటోంది. పోలవరం ప్రాజెక్ట్ వద్ద మరో 12 టిఎంసి నీరు అందుబాటులో ఉందని అంచనా వేశారు. మరో 25 టిఎంసిల గోదావరి ప్రవాహం ద్వారా అందుబాటులో ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులను దృష్ట్యా సకాలంలో నిధులు మంజూరు చేయకపోతే రబీ సాగుకు ఇబ్బంది పడే అవకాశం ఉంది. రబీ ముందస్తు సాగు చేపట్టి జనవరి మొదటి వారం నాటికే నాట్లు పూర్తి కావాలని అధికారులు సూచిస్తున్నారు. ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా సాగు చేపట్టకపోతే చివరిదశలో పంట దెబ్బతినే అవకాశం ఉందనే హెచ్చరిక చేస్తున్నారు. గత అనుభవాల రీత్యా రబీలో పరిస్థితులు చేయి దాటిపోకుండా ఉండాలంటే అవసమైన చోట ఎత్తిపోతలను అమలు చేయాలి. కాలువల్లోనూ ఇంజన్‌లు ఏర్పాటు చేయాలి. స్లూయిజ్‌లు మరమ్మతులు చేయాలి. డ్రెయిన్‌లలో నీటిని వినియోగించు కోవాలి. కాలువలు, డ్రెయిన్‌లలో తూడు, గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు చేపట్టాలి. రెండేళ్లుగా ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థపై చిన్నచూపు చూస్తోంది. ఆశించిన స్థాయిలో నిధులు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ఈ ఏడాది ప్రతిపాదనలు పంపే విషయంలోనే ప్రభుత్వం కట్టడి చేసిందని గణాంకాలు చెబుతున్నాయి. కొద్ది మొత్తంలోనే అంచనాలు రూపొందించాలంటూ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే రబీలో సాగుకు కేవలం రూ.10 కోట్లు అవసరమవు తాయంటూ ప్రతిపాదనలు పంపారు. 2021లో ప్రభుత్వం రూ.63 కోట్లు మంజూరు చేసింది. 2022లో అధికారులు రూ.65 కోట్లు అంచనా వేయగా ప్రభుత్వం కేవలం రూ.10 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఐఎబి సమావేశం ముగిసి వారం రోజులు గడిచినా నేటికీ నిధులు మంజూరుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

వారం రోజుల్లో నిధుల విడుదల

ఉమ్మడి జిల్లాలో జిల్లాల వారీగా ఇటీవల సాగునీటి సలహా మండలి సమావేశాలు తీసుకున్నాము. ఉన్నతాధికారులు, సభ్యుల సూచనలను తీసుకున్నాము. రబీ సాగుకు రూ.10 కోట్లు అవసరం అని ప్రభుత్వానికి నివేదిక అందజేశాము. మరో వారం రోజుల్లో నిధులు విడుదల అవుతాయని అంచనా వేస్తున్నాము.

- జి.శ్రీనివాసరావు, ఎస్ఇ ధవళేశ్వరం, ఇరిగేషన్ సర్కిల్.

27, 28 విజయవాడలో కార్మిక, కర్షక మహాధర్నా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 విజయవాడలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని పలువురు నాయకులు పిలుపు ఇచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ సెంటర్లో బుధవారం సిఐటియు కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.అన్నామణి, కె.పోశమ్మ, ట్రెజరర్ ఎం.వెంకటలక్ష్మి మాట్లాడారు. మోడీ 9 ఏళ్ల పరిపాలనలో 80 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి నెట్టబడ్డారని, దేశవ్యాప్తంగా ప్రజలకిచ్చే పప్పు, ఉప్పు, పెన్షన్ వంటి పథకాలపై కార్పొరేట్ మేధావివర్గం పెద్దఎత్తున దేశాభివృద్ధికి నష్టమని ప్రచారం చేస్తూ, మరోవైపు కార్పొరేట్ కంపెనీలకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీపై పల్లెత్తు మాట్లాడకుండా దేశప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. దేశంలో ప్రతి 20 నిమిషాలకు వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల పాలైన రైతు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పారు. రైతాంగం పంటలకు ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి గిట్టుబాటు ధర చట్టం చేస్తేనే రైతాంగాన్ని సంక్షోభం నుంచి కాపాడగలమన్నారు. దేశవ్యాప్తంగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని చేరుకుంటుంటే ప్రజలు ఎలా బతకాలని ప్రశ్నించారు. తక్షణం నిత్యవసరాలపై జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెట్రోలియం ఉత్పత్తుల వంటగ్యాస్‌పై కేంద్రం విధించిన ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలన్నారు. కాకినాడ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల్లో పంట కోతలు జరుగుతుంటే జగన్ ప్రభుత్వ కొనుగోలు నామమాత్రంగానే ఉందని, దీంతో జిల్లా రైతాంగం తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం మొత్తం పంటని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి మోడీ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై తీవ్రమైన భారాలు మోపుతుందని రాబోయే రోజుల్లో స్మార్ట్ మీటర్ల పేరుతో యూనిట్ 50 రూపాయలు అమ్ముకునేందుకు కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం చేసింది విమర్శించారు. ప్రజలను అధిక ధరల నుండి నిరుద్యోగం నుండి రైతాంగ సంక్షోభం నుండి పక్కదారి పట్టించేందుకే బిజెపి పెద్దలు మతోన్మాదాన్ని ప్రాంతీయ తత్వాన్ని కులపరమైన విభజనలను తీసుకు వస్తోందన్నారు.

ధాన్యం కొనుగోలు పరిశీలన

ప్రజాశక్తి-రాజానగరం

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 169 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. మండలంలోని కొండగుంటూరులో ఆర్‌బికెను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అధికారులు బుధవారం సందర్శించారు. రికార్డులను, డేటా ఎంట్రీ వివరాలను, తేమ శాతం తనిఖీ, బరువు కొలిచే విధానం, రికార్డుల నిర్వహణ, రశీదు జారీ గురించి టెక్నికల్ అసిస్టెంట్, వ్యవసాయ సహాయకులను అడిగారు. అనంతరం రైతులతో కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడారు. కొనుగోళ్లు జరిపిన 24 గంటల్లోగా నగదు రైతుల ఖాతాలలో జమ అవ్వడం జరుగుతోందని తెలిపారు. జిల్లాలో 231 అర్‌బికెల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు చేపడతామని ఇప్పటికే క్షేత్ర స్థాయిలో కోతలు ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేసి, ఆయా గ్రామాల పరిధిలోని కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. 167 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు ప్రారంభించడం జరిగిందని క్షేత్ర స్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి పర్యటించి రైతుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మిల్లర్ల నుంచి వత్తిడి లేదని, అదనపు డబ్బులు ఏమి అడగడం లేదని జెసి రైతులు తెలిపారు. పొలం వద్దకు లారీ వచ్చి సేకరిస్తున్నట్లు వాహనానికి జిపిఎస్ ట్రాకింగ్ పరికరం ఏర్పాటు చేసినట్లు డ్రైవర్ కలెక్టరుకు తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో డిఎం పౌర సరఫరాలు ఎ.కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవ రావు, తహశీల్దార్ పవన్ కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, రైతులు చిలకలపూడి శ్రీను, నసింశెట్టి చక్రరావు, కొలమూరి లోవరాజు, పిన్నికి నాగేశ్వరరావు, చిలకలపూడి వాసు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు దేవరపల్లి విద్యార్థి

దేవరపల్లి : దేవరపల్లి ఎఎస్ఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.వర్షిణి అండర్ 14 సెపక్ తక్రా విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. డిసెంబర్ 2, 3, 4, 5 తేదీల్లో బీహార్ పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని హెచ్ఎం బి.శ్రీలక్ష్మి తెలిపారు. పీడీ ఓరుగంటి నాగరాజు, పిఇటి ఎం.లక్ష్మణరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.శంకరుడు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

చాగల్లు : మండలంలోని మార్కొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు దేవరపల్లిలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14, అండర్ 17 క్రికెట్ విభాగంలో మనెల్లి సాత్విక, ఉమా మహాలక్ష్మి ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా బుధవారం విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ లెనిన్ బాబును పేరెంట్ కమిటీ ఛైర్మన్ పి.చంటిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

కాలనీలో సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి- గోకవరం

జగనన్న కాలనీలో రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని లేకుంటే తహశీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తామని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పాంటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మల్లదొడ్డి గ్రామంలో గుంతల ఆంధ్ర ప్రదేశ్‌కి దారేదీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ వెదురుపాక, బావాజీపేట, గుమ్మళ్లదొడ్డి గ్రామ ప్రజలకు సుమారు 300 మందికి జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చారని, జరిగిందని ఆ కాలనిలో రహదారులు, మౌలిక సదుపాయాలు లేవన్నారు. నాలుగేళ్లయి కార్యాచరణ చేపట్టలేదని తెలిపారు. ఈ సందర్భంగా సంఘటన స్థలానికి వచ్చిన గోకవరం తహశీల్దార్ శ్రీనివాస్‌కు అక్కడ ఉండే సమస్యలను సూర్యచంద్ర వివరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

మహేంద్ర మృతికి కారకులను అరెస్టు చెయ్యాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

దొమ్మేరు దళిత యువకుడు బొంతా మహేంద్ర ఆత్మహత్యకు కారకులైన వైసిపి నాయకులు ముదునూరి నాగరాజు, బి.సతీష్, ఎస్ఐ భూషణంను వెంటనే అరెస్ట్ చెయ్యాలని కెవిపిఎస్ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు డిమాండ్ చేశారు. దొమ్మేరులో ఫ్లెక్సీ వివాదంలో మహేంద్రను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితులను అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ సంఘటన జరిగి 9 రోజులు కావస్తున్నా హోమ్ మంత్రి ఇలాకాలో నిందితులను ఎందుకు అరెస్ట్ చెయ్యలేదని రాంబాబు ప్రశ్నించారు. నిందితులను వారంలోగా అరెస్ట్ చెయ్యకపోతే దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకుడు జువ్వల రాంబాబు

సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లాలో దళిత గిరిజనులపై దాడులు పెరిగాయన్నారు. దళిత గిరిజనులకు సిపిఎం అండగా ఉంటుందని అన్నారు. రిపబ్లికన్ పార్టీ నాయకులు నక్కా వెంకటరత్నం మాట్లాడుతూ జిల్లాలో దళితులపై దాడులు చేసిన వారు చేయించేవారు చేసేవారు వైసిపిలోని అగ్రకులనాయకులే ఎక్కువ అని దళితులపై అఘాయిత్యాలు చేసిన వారికి జగన్ మోహన్ రెడ్డి పదోన్నతులు కల్పిస్తున్నారని విమర్శించారు. ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె.మస్తాన్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని అమలు చెయ్యకుండా ప్రభుత్వమే నీరుగారుస్తూ ఆధిపత్య కులాలకు అండగా ఉంలోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరుకొండ చిరంజీవి, టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు బొర్రా చిన్న, టిడిపి ఎస్‌సి సెల్ నాయకురాలు, ఖండవల్లి లక్ష్మి, దళిత నాయకులు దారా యేసురత్నం, దుర్గారావు, సుబ్బారావు, కెఎన్‌పిఎస్ నాయకులు కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వి.రాంబాబు, దువ్వాడ రాజా పాల్గొన్నారు.

సంవత్సరాంతానికి ఊడ్పులు పూర్తవ్వాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రానున్న రబీ సీజన్‌కు సంబంధించి ఉడ్పులు డిసెంబర్ 31 తేదీ నాటికి పూర్తవ్వాలని ఉండ్రాజవరం మండల వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని చివటం ఆర్‌బికె సెంటర్లో ఏర్పాటు చేసిన రైతులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, మార్చి 31వ తేదీకి కాలువలు బంద్ చేయనున్న నేపథ్యంలో రైతులు డిసెంబరు చివరినాటికి నాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. పిఆర్.126, ఎక్స్‌ఎల్ 10 వరి సివిల్ సప్లై సంస్థ కొనుగోలు చేయని కారణంగా రైతులు ఆయా రకాల పైరు నాటకుండా ఉంటే మంచిదన్నారు. ఫెర్టిలైజర్ లభ్యత గురించి చర్చించారు. వ్యవసాయ అధికారులు సిబ్బంది రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ అధ్యక్షులు కొఠారు సత్యనారాయణ, కూనపరెడ్డి నరసింహరావు, మన్నె త్రిమూర్తులు, మట్టా పరమేష్ పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్స్‌లో నన్నయ బి.ఫార్మసీ కోర్సు

రాజానగరం : ఎపిఇఎపి సెట్ బైసిపి విభాగం వెబ్ ఆప్షన్స్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో బి ఫార్మసీ కోర్సు అందుబాటులో ఉందని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ బి ఫార్మసీ కోర్సుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం లభించిందని అన్నారు. దీని ద్వారా ఆదికవి నన్నయ యూనివర్సిటీ బిఫార్మసీ కోర్సు లో చేరేందుకు ఎపిఇఎపి సెట్ వెబ్ ఆప్షన్స్ లో విద్యార్థులు ఆప్షన్ పెట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. తాడేపల్లిగూడెం ప్రాంగణంలో నూతన భవనంలో బిఫార్మసీ కోర్సు నడపబడుతుందని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అధునాతన లాబరేటరీ వంటి వసతులు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 22 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చునని చెప్పారు. బిఫార్మసీ కోర్సు చేయాలనుకునే విద్యార్థులకు చక్కని అవకాశమని తెలియజేశారు.

'మైనింగ్ మాఫియా లీడర్ సిఎం జగన్'

ప్రజాశక్తి-కడియం

సహజ వనరులు ఖనిజ సంపద దోపిడీ చేస్తున్న మైనింగ్ మాఫియాకు ముఖ్యమంత్రి జగన్ లీడర్‌గా వ్యవహరిస్తున్నారని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. మండలంలోని బుర్రిలంక ఇసుక ర్యాంపునును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తవ్వుకో, దోచుకో, దాచుకో అన్నట్టు జగన్ వ్యవహారం ఉందని వైసిపి నాయకులు ప్రజాప్రతినిధులు చెడ్డీ గ్యాంగ్‌లా తయారై సహజ సంపదలను దోచేస్తున్నారన్నారు. తవ్వకాలు అనుమతులకు సంబంధించి ఏవిధమైన రికార్డులు రాయడం లేదని, తాము రావడంతో ఇక్కడ సిబ్బంది పారిపోయారన్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవిన్యూ, ఆర్‌డిఒ, అధికారులు పత్తా లేకుండా పోయారని అన్నారు. నదీగర్భంలో భారీయంత్రాలతో ఇసుక తవ్వకాలు కొనసాగిస్తూ పర్యావరణ అనుమతులు అతిక్రమిస్తున్నారని, అధికలోడులతో రోడ్లను ఛిద్రం చేస్తున్నారన్నారు. సంవత్సరాల తరబడి రోజూ వందలాది లారీల్లో వేలాది టన్నులు ఇసుక తరలించుకు పోతున్నారని, దీని వల్ల భవిష్యత్తులో భూగర్భ జలాలకు, కాటన్ బ్యారేజ్‌కు ప్రమాదం ఏర్పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థి నిజాయితీ

కడియం : కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థి సాయికుమార్‌కు రూ.20 వేల విలువైన బంగారు లాకెట్ పాఠశాల ఆట స్థలంలో దొరగ్గా దాన్ని హెచ్ఎం సత్యనారాయణకు అందించాడు. ఈ లాకెట్ అదే పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి లోవరాజు ఆటలాడే సందర్భంలో పోగొట్టుకున్నాడు. లోవరాజు తల్లికి లాకెట్‌ను హెచ్ఎం అందించారు. పాఠశాల స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, పీడీ వీరబాబు, ఉపాధ్యాయులు సాయికుమార్‌ను అభినందించారు.

నిరాడంబరంగా గన్ని కృష్ణ పుట్టినరోజు

రాజమహేంద్రవరం : టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పుట్టినరోజు వేడుకలు బుధవారం సన్నిహితుల మధ్య నిరాడంబరంగా జరుపుకున్నారు. బొకేలు, ఫ్లెక్సీలు లేకుండా రావాలని ఆయన ఇచ్చిన పిలుపుమేరకు పార్టీ శ్రేణులు గన్ని కృష్ణ మిత్రబందం ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సేవా కార్యక్రమాల్లో గన్న కృష్ణ పాల్గొన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు రెడ్డి మణి, నాయకులు మరుకుర్తి రవి యాదవ్, యర్రా వేణుగోపాల్ రాయుడు, రాష్ట్ర కార్యదర్శులు కాశి నవీన్ కుమార్, వెలుగుబంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోగికి చందన ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం రూరల్ : పక్షవాతంతో బాధ పడుతున్న ఒక వ్యక్తికి ఆర్థిక సహాయం చేసి వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మానవత్వం చాటుకున్నారు. ధవళేశ్వరం గొల్లపేటలో నివాసం ఉంటున్న పిట్ల రాజు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పక్షవాతం రావడంతో ఆటో నడపలేక కుటుంబ పోషణ భారంగా మారింది. సామాజిక పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. చందన్ నాగేశ్వర్‌ను కలిసి సాయం చేయమని కోరడంతో ప్రతి నెలా పెన్షన్ వచ్చే వరకు రూ.మూడు వేల చొప్పున చందన అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సాధనాల చంద్రశేఖర్, వైసిపి వికలాంగుల అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, కన్వీనర్ బర్రే కామేశ్వరరావు, ముత్యాల జాన్, ముద్దాడ బాబీ, వైవి.సత్యనారాయణ, ఇందల శ్రీనివాస్, సుంకర. నారాయణ, జొన్నాడ జయదేవ్, ముత్యాలు, వాలంటీర్ బాషా పాల్గొన్నారు.

లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాపిరాజు

రాజమహేంద్రవరం : స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడు డాక్టర్ పుప్పాల బాపిరాజు మరో ఘనత సాధించారు. లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయన పేరు నమోదయ్యింది. కోవిడ్ సమయంలో తన చిత్రాల ద్వారా అందించిన సందేశాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని, దీంతో ఆయన పేరు రికార్డ్ చేస్తున్నట్టు లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా విభాగం ఛైర్మన్ డాక్టర్ అవినాష్ డి.సకుండే బాపిరాజుకు పంపిన సందేశంలో పేర్కొన్నారు. డాక్టర్ బాపిరాజును డిఇఒ ఎస్.అబ్రహాం, డివైఇఒ ఇవిబిఎన్.నారాయణ, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, ఎంఇఒ-2 రమా రజని, ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంవిఎం.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

25న బిఎస్‌పి రిలే దీక్ష

పెరవలి : ఈ నెల 25న నిడదవోలులో చేపట్టిన ఒకరోజు రిలే దీక్షను విజయవంతం చేయాలని బిఎస్‌పి కన్వీనర్ వెన్నక సుధాకర్ పిలుపు నిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించడాన్ని నిరసిస్తూ ఈ దీక్ష చేపట్టినట్టు చెప్పారు. దీక్ష కరపత్రాలను ఆయన బుధవారం కానూరు గ్రామంలో ఆవిష్కరించారు. 2019-23, 24 సంవత్సరానికి సంబంధించి రూ.కోట్లాది నిధులను ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. నేటికీ నియోజవర్గంలో కనీస అవసరాలైన రోడ్లు, తాగునీరు సౌకర్యాలు లేవని దళితుల శ్మశానాలు అన్యాక్రాంతం అయిపోతున్న ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. దీనిపై నిరసనగా 25వ తేదీన దీక్ష చేస్తున్నట్టు ఆయన తెలిపారు దీక్షను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి జీడిగుంట వెంకటేశ్వరరావు, కప్పల ఇజ్రాయిల్, హర్షవర్ధన్, శ్రీను రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పీడీ విచారణ

పెరవలి : పెరవలి ఐసిడిసి పరిధిలో ఖండవల్లి సెక్టార్ సూపర్‌వైజర్ పి.వనజాక్షి ఆగస్టు 16న అంగన్‌వాడీ కేంద్రం నుంచి బియ్యం, ఇతర వస్తువులను తరలిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. దీనిపై బుధవారం ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణి, సీనియర్ అసిస్టెంట్ సత్యవతి సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలలను క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. దీనిపై ఆర్‌జెడి ఉన్నతాధికారులకు రిపోర్టును అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఎం.శ్రీలక్ష్మి, సిబ్బంది ఆనంద్ ఎంపిటిసి బొక్కే వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఇలాగైతే వచ్చే ఎన్నికల్లో మనతో 'అది' పోయిస్తారేమో సార్..!!

అభివృద్ధి, పథకాలపై వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం, ఉండ్రాజవరం, కడియం

మండలంలోని కృష్ణునిపాలెంలో సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి సుంకర శ్రీవల్లి పాల్గొని నాయకులతో కలిసి సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీవల్లి మాట్లాడుతూ జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు గ్రామంలో సుమారు రూ.16 కోట్లతో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు, వైసిపి కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, రౌతు జోగేశ్వరరావు, తోలేటి రమ్యశ్రీ ప్రసాద్, ప్రసన్న, కర్రి శివరామకృష్ణ, వైస్ ఎంపిపి మడికి మైనర్ బాబు, కర్రి సూరారెడ్డి, పెనుగొండ సత్యానందం, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, శివయ్య పాల్గొన్నారు. ఉండ్రాజవరం మండలంలోని చివటం, పంచాయతీ కార్యాలయంలో బుధవారం వై ఎ పి నీడ్స్ జగన్, జగనన్న నువ్వే మా నమ్మకం, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పట్టిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి మాట్లాడుతూ చిన్నచిన్న గ్రామాలకు సైతం రూ.కోట్ల నిధులు విడుదల వుతున్నాయని చెప్పారు. జెసిఎస్ ఛైర్మన్ కఠారి సిద్ధార్థ రాజు, కొఠారు సత్యనారాయణ, గంటిన లక్ష్మీ గణపతి, కానూరి వీరాస్వామి, శివ, కోలా గణపతి, గుత్తికొండ శ్రీనివాసు, ఇఒపిఆర్‌డి, జెడివి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి పాల్గొన్నారు. కడియం మండలం కడియపులంకలో వైసిపి మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ఆధ్వర్యాన సచివాలయం-1 వద్ద ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. కడియపులంక సొసైటీ ఛైర్మన్ తిరుమల శెట్టి శ్రీను, బోడపాటి సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ ఈలి గోపాలరావుతో జెండాను ఆవిష్కరించారు.

'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన

ప్రజాశక్తి -గోకవరం

గోకవరం ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ఎంపిడిఒ కె.పద్మజ్యోతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు సుంకర వీరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్ల పైబడిన వారి కోసం ఆడుదాం ఆంధ్ర పేరుతో అనే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీలు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. గ్రామ సచివాలయం, వాలంటీర్ ఆధ్వర్యంలో కులగణన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు టి.శ్రీనివాసరావు, గోపన్న దొర, గనిరాజు, శివయ్య, అబ్రహాం, తోలేటి రామ్‌ప్రసాద్, సచివాల సిబ్బంది వాలంటరీలు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-దేవరపల్లి

ఇటీవల దేవరపల్లిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన జనసేన కార్యకర్త కోట సురేష్ కుటుంబాన్ని బుదవారం గోపాలాపురం నియోజకవర్గ జనసేన నాయకులు పరామర్శించారు. అనంతరం జనసేన నాయకులు, జనసైనికులు అందరూ కలిసి కుటుంబ సభ్యులకు రూ.25,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం జనసేన పార్టీ నాయకులు సువర్ణ రాజు, అనిశెట్టి గంగరాజు, కంబాల సత్తిబాబు, సూరిసెట్టి బాలు, జాజిమొగ్గల శ్రీనివాసు, అడబాల మణికంఠ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బావమరిదిపై దాడి చేసిన బావపై కేసు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

తన అక్క కాపురం విషయంలో పెద్దల సమక్షంలో మాట్లాడుతుండగా ఆగ్రహంతో కర్రతో బావమరిదిపై దాడికి దిగిన బావపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బివై.కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు పేరవరం గ్రామానికి చెందిన కోట వీరమణికి, తాడేపల్లిగూడెంకు చెందిన ఎలిగింటి నరసన్నకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఈనెల 21న పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. పెద్దలు మాట్లాడుతుండగా నరసన్న దురుసుగా ప్రవర్తించి తన బావమరిది వెంకటేశ్వరరావును కర్రతో కొట్టి గాయపరిచాడు. దుర్భాషలాడుతూ పెద్దలను సైతం బెదిరించాడు. గాయపడిన వెంకటేశ్వరరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి కోసం గాలింపు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

అదృశ్యమైన ర్యాలి గ్రామానికి చెందిన వసదర్ల చిన్నబూరయ్య ఆచూకీ కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 16న సాయంత్రం బహిర్భూమికి వెళ్లి బూరయ్య తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆయన భార్య ఆచ్చాయమ్మ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ బివై.కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఎక్కడికైనా వెళ్లాడా, లేదా ప్రమాదవశాత్తూ గోదావరిలో పడిపోయాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ర్యాలీ పరిసర ప్రాంతాల్లో, గోదావరి కాలువల వెంబడి గాలింపు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జాతీయ రహదారి తూర్పుగానుగూడెంలో వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గండేపల్లికి చెందిన దంపుపడాల శ్రీను జిఎస్ఎల్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కుమార్తెకు బైకుపై మంగళవారం రాత్రి భోజనం తీసుకెళ్తున్నాడు. ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వెళ్తున్న బల్ల రిక్షాను వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అతన్ని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. రిక్షా కార్మికుడు గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- పెద్దాపురం

స్థానిక శతాబ్ది పార్కు వద్ద గల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా ఈనెల 23వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ తెలిపారు. పట్టణ పరిధిలోని సత్తిరెడ్డి పేట, దర్గా పేట, భాస్కర్ కాలనీ, బంగారమ్మ గుడి వీధి, వీరయ్యమ్మ పేట, ఆర్‌బి.పట్నం రోడ్డు, నువ్వుల గుంట వీధి, పాత ఆసుపత్రి వీధి, మంగళవారపు పేట, గౌరీ కోనేరు కాలనీ, అంకయ్యపేట, సుబ్బయ్య పేట, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



లక్షదీపార్చనలో సర్పంచ్ తదితరులు

భీమేశ్వరాలయంలో లక్ష దీపార్చాన

ప్రజాశక్తి రామచంద్రపురం

కార్తీక మాసం సందర్భంగా హసన్‌బాదలోని భీమేశ్వరాలయంలో లక్ష దీపార్చన చేశారు. ఈ సందర్భంగా ఉండి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో వివిధ పూజలు, హోమాలు నిర్వహించారు. లక్ష ఒత్తులతో దీపాలు వెలిగించారు. అనంతరం తీర్థం ప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బోడిపాలెం వంతెన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

బోడిపాలెం వంతెన శిథిలావస్థకు చేరింది. అయినప్పటికీ నిత్యం వందలాది లారీలు 40-50 టన్నుల మట్టి లోడ్‌తో దీనిగుండా ప్రయాణిస్తున్నాయం. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కపిలేశ్వరపురం మండలం లంక గ్రామాల సమీపంలో బోడిపాలెం వద్ద బ్రిటిష్ కాలంలో వంతెనను నిర్మించారు. అప్పటి నుంచి ఈ వంతనపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన శిథిలావస్థకు చేరడంతో పలుమార్లు స్థానికులు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మిస్తామని చెప్పడం తప్ప ఈ దిశగా అడుగులు వేసింది లేదు. కేదార్లంక, వీధివారి లంక, నారాయణలంక ప్రజలు ఏ చిన్న పనికి అయినా కొత్తపేట, రావులపాలెం, అమలాపురం వంటి ప్రాంతాలకు వెళ్తుంటారు. ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ వంతెనే ఆధారం. ఈ వంతెన కాస్తా కూలి పోతే ఆయా గ్రామాలకు రాకపోకలు తెగిపోతాయి. అదే జరిగితే తమ పరిస్థితి ఏంటని ఆయా గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకముందే నూతన వంతెన పనులను చేపట్టాలని, అప్పటి వరకూ భారీ వాహనాలను నిలువరించాలని కోరుతున్నారు.

రైతులకు ఇచ్చే రుణ పరిమితుల ప్రతిపాదన

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా

పెట్టుబడి, ఉత్పాదక వ్యయం, ఇన్‌పుట్ ధరల పెరుగుదల వంటి అంశాల ఆధారంగా 2024-25 సంవత్సరానికి జిల్లాలో వివిధ వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు అందించే రుణ పరిమితులను జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ ప్రతిపాదించింది. బుధవారం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పాడి, మత్స్య కార్యకలాపాలు చేపట్టే రైతులకు ఉత్పాదక వ్యయం, రాబడులు ఆధారంగా బ్యాంకుల ద్వారా అందించగల రుణ పరిమితులను ఆయా శాఖల జిల్లా అధికారులు కమిటీకి వివరించారు. ఉత్పాదక వ్యయంలో కనీసం 60 శాతం పంట కాలిక రుణాలుగా అందించేందుకు ఆయా అంశాల కింద స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితులను కమిటీ నిర్ణయించింది. ఎకరాకు ప్రధాన పంట వరికి రూ.38 వేల నుంచి రూ.45 వేలు, మొక్కజొన్నకు రూ.28 వేల నుంచి రూ.42 వేలు, మిరపకు రూ.68 వేల నుంచి రూ.75 వేలు, పత్తికి రూ.40 నుంచి రూ.60 వేలు, అరటి రూ.75 వేల నుంచి రూ.85 వేలు, మామిడికి రూ.40 నుంచి రూ.45 వేలు, బొప్పాయికి రూ.72 నుంచి రూ.75 వేలు, ఆయిల్ పామ్‌కు రూ.65 వేలు, కురగాయ పంటలకు రూ.16 వేల నుంచి రూ.40 వేలు, ఉల్లికి రూ.45 వేల నుంచి రూ.51 వేలుగా రుణపరిమితి కమిటీ నిర్ణయించింది. అలాగే మల్బరీ, పట్టుపురుగుల రూ.85 వేల నుంచి రూ.95 వేలు, రొయ్యల సాగుకు రూ.5 లక్షల నుంచి రూ.5.50 లక్షలుగా నిర్ణయించింది. కమిటీ నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితుల ప్రతిపాదనలను రాష్ట్ర కమిటీ ఆమోదానికి పంపాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిసిబి సిఇఒ ఆర్‌వి.నరసింహా రావు, ఎల్‌డిఎం సిహెచ్‌ఎస్‌వి ప్రసాద్, నాబార్డ్ ఎడిఎం డాక్టర్ వై.సోమునాయుడు, వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, పశుసంవర్ధక శాఖ జెడి ఎస్.సూర్యప్రకాశరావు, మత్స్య శాఖ జెడి పి.సత్యనారాయణ, పెద్దాపురం హార్టికల్చర్ అధికారిణి కె.సత్యశైలజ, ఎస్‌బిఐ డిప్యూటీ రీజనల్ హెడ్.నారాయణ, సిజిజిబి బిఎం బి.చంద్రశేఖర్, ఇతర బ్యాంకుల అధికారులు, డిసిసిబి అధికారులు పాల్గొన్నారు.

నాణ్యతను మెరుగుపర్చేందుకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న భాస్కర్

రాష్ట్రీయ ఉచ్చాతర్ శిక్షా అభియాన్ (రూసా)లో భాగంగా బోధన, అభ్యసనా ప్రక్రియల నాణ్యతను మెరుగుపర్చేందుకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా.భాస్కర్ తెలిపారు. జెఎన్‌టియుకె చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. విశ్వవిద్యాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపకులపతి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు, చీఫ్ ఇంజనీర్, రూసా కో-ఆర్డినేటర్, ప్రిన్సిపల్‌తో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం వసతి గృహాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యక్రమాలు చేపట్టడం, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు, బోధనా, అభ్యసనా పద్ధతులను మరింత బలోపేతం చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలో రూసా నిధులతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేస్తామని ఉపకులపతి ప్రసాదరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో రూసా కో-ఆర్డినేటర్ మరియు ఉమెన్ ఎంపవర్మెంట్, గ్రీవెన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.స్వరూపారాణి, చీఫ్ ఇంజనీర్ ప్రొఫెసర్ వి.శ్రీనివాసులు, యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎంహెచ్‌ఎం.కృష్ణప్రసాద్, చీఫ్ ఇంజనీర్ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 6 డివిజన్ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంతంగా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల సొమ్మును జమ చేస్తోన్న ఏకైక సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఇటువంటి సిఎంను మరోసారి గెలిపించుకుంటే పేదల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, వైసిపి నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, స్థానిక నాయకులు తెలుగు రామకృష్ణ, జార్జి, సారధి, అంజిబాబు, రెడ్డి, నందకుమార్, తొంపల తాతారావు, సిగల మధు, బత్తిన రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి ఏసుబాబుకు ఘన సత్కారం



సేసుబాబును సత్కరిస్తున్న అధికారుల, ఉద్యోగులు

ప్రజాశక్తి - కాకినాడ

గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి పొందిన కాకినాడ నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబును కార్పొరేషన్ అధికారులు బుధవారం ఘనంగా సత్కరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సత్కార సభలో వివిధ విభాగాధిపతులు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ సమర్థవంతమైన సేవలతో గుమస్తా నుంచి అంచలంచెలుగా గ్రేడ్-1 కమిషనర్‌గా ఉద్యోగ ఉన్నతి పొందిన ఏసుబాబు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ, లీగల్ అడ్వైజర్ డివిఎస్‌ఎన్ మూర్తి (మురళి) మాట్లాడుతూ క్రింది స్థాయి ఉద్యోగుల నుంచి అధికారుల వరకు అందర్నీ సమన్వయం చేసుకుంటూ ఏసుబాబు చేసిన సేవలే ఆయనను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాయన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఎసిపి నాగశాస్త్రులు, ఇఇలు వెంకటరావు, మాధవి, ఎఇ శిరీష్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

ప్రజాశక్తి - కరప

సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు లబ్ధి పొందుతున్నారని జడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఎంపిపి పి.శ్రీలక్ష్మీ సత్తిబాబు అన్నారు. మండలంలోని పాతర్లగడ్డ గ్రామంలో సర్పంచ్ ఏసుబాబు అధ్యక్షతన ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం బుధవారం ఇఒపిఆర్‌డి ఎస్‌వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శి బి.చంద్రకళ పి.సుధాకర్ నిర్వాహణలో జరిగింది. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని సిఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చింతా ఈశ్వరరావు, ఉప సర్పంచ్ పులుగు నారాయణ మూర్తి పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కాజులూరు



బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి అధ్యక్షులు గుబ్బల యేసు రాజు అన్నారు. బుధవారం మండల మండలంలోని మంజేరు గ్రామంలో గుంటూరు అప్పారావు ఆధ్వర్యంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో యేసు రాజు పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం జగన్ పని చేస్తున్నారని అన్నారు. గతంలో ఏ సిఎం చేయని విధంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వనుము వెంకటసుబ్బారావు, ఎంపిపి మాత భారతి మురళి, మంజేరు, గొల్లపాలెం, తణుకువాడ సహకార సంఘ అధ్యక్షులు గండి కిషోర్, సత్తి శ్రీరామారెడ్డి, పితాని సుబ్రమణ్యం, కాజులూరు ఉపసర్పంచ్ దండంకి చిన్నారావు ఎంపిటిసి దడాల రమేష్, సర్పంచులు నెల్లి బ్రహ్మాజీ, నరాల సుబ్బరాజు, మాజీ సర్పంచ్ పోతురాజు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

అంగన్‌వాడీ కార్యకర్తలకు సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 8 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధపడుతున్న అంగన్‌వాడీలతో చర్చలు నిర్వహించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు తెలంగాణా కంటే రూ.1000 అదనంగా ఇస్తానని సిఎం హామీ ఇచ్చారని, నాలుగున్నరేళ్ల పాలన పూర్తియినా నేటికీ వారికి ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, కావున సిఎం ఇచ్చిన హామీ మేరకు వారికి జీతాలు పెంచడంతోపాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో వారు చేసే సమ్మెకు ప్రజలంతా సంపూర్ణంగా మద్దతు ఇస్తారని అన్నారు.

మహేశ్వరరావుకి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - కాకినాడ

ఒంటిమామిడిలో సాంప్రదాయ వైద్యం చేస్తున్న ఉపాధ్యాయుడు కెవికె.మహేశ్వర రావుకి 2022 సంవత్సరానికి పట్టాభి కళా పీఠం జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఎముక విరిగితే పుత్తూరు, పచ్చకామెర్లు వస్తే వెల్ల, గాయం మానకపోతే తొండంగి మండలం ఒంటిమామిడి గ్రామంలో చేసే సాంప్రదాయ వైద్యం చేయించుకోవడానికి వెళుతుంటారు. గాయాలు, దెబ్బలు, తెగిన గాయాలు, కాలిన గాయాలు, షుగర్ పుండ్లు, గ్యాంగ్రీన్, మానవ మొండి పుండ్లు, పాముకాటు గాయాలు, వెరికోజ్ వెయిన్ గాయాలు, సెప్టిక్ గాయాలు తదితర గాయం ఏదైనా తన పూర్వీకులు, గురువుల నుండి నేర్చుకున్న వైద్యం చేస్తూ దానవాయిపేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కెవికె మహేశ్వరావు సేవలు అందిస్తున్నారు. వీళ్లు కాళ్లు కట్ చేయకుండా చేస్తున్న ఈ ప్రత్యేక వన సంజీవిని వైద్యానికి 2022 సంవత్సరానికి గాను జాతీయ స్థాయిలో ప్రతి ఏటా ఇస్తున్న పట్టాభి కళా పీఠం జాతీయ పురస్కారానికి మహేశ్వ రరావును ఎంపిక చేశారు. ఈ పురస్కారాన్ని నవంబర్ 24 తేదీన గుంటూరులో ప్రధానం చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు మహేవ్వరరావును అభినందించారు.

మత్తు పదార్థాలు అమ్మితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

గ్రామాల్లో నిషేధిత పదార్థాలైన గంజాయి, నాటు సారా వంటివి తయారు చేసినా, అమ్మినా చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సిఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని నరేంద్రపట్నంలో బుధవారం స్థానిక ఎస్ఐ నాగార్జునరాజు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎవరైనా సారా తయారు చేస్తున్నా, అమ్ముతున్నా, జుదాలను నిర్వహిస్తున్నా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరానలు గోప్యంగా ఉంచుతామన్నారు. వివాహాది శుభకార్యాలకు ఇల్లు విడిచి కుటుంబ సమేతంగా బయట ప్రాంతాలకు వెళ్లే వారు ముందుగా జగ్గంపేట స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామంలో స్థానికుల నుంచి ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు మొత్తం ఐదుగురితో పీస్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. వీరు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెత్తనం అంతా పురుషులదే...

ఇళ్లకే పరిమితమవుతున్న మహిళా ప్రజాప్రతినిధులు

ప్రశ్నార్థకమవుతున్న మహిళా సాధికారత?

ప్రజాశక్తి-రామచంద్రపురం



మండల పరిషత్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఓ ప్రజాప్రతినిధి భర్త

మహిళలు వెనకబాటు తనం నుంచి బయటకు రావాలని వారికి స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం ఇవ్వాలని భారత రాజ్యాంగం 73వ సవరణ ద్వారా మహిళలకు సాధికారత కల్పించారు. 1970లో అమల్లోకి వచ్చిన మహిళా సాధికారత బిల్లు ద్వారా మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. మహిళా సాధికారత అంటే మహిళల శక్తి యుక్తులను బలోపేతం చేయడం, వారి సామర్థ్యాలను మెరుగుపరచడం, సమర్థులుగా తయారు చేయడం. అందులో భాగంగా వారందరికీ స్థానిక సంస్థలు, శాసనసభల్లోనూ రిజర్వేషన్లు కల్పించి, వారికి పరిపాలన పరమైన లక్షణాలతోపాటు నాయకత్వం వహించే అవకాశం కల్పించారు. అయితే మహిళా ప్రతినిధులు రిజర్వేషన్లు ప్రకారం ఎంపికైనప్పటికీ వారి పదవులను సైతం మగమహారాజులు అనుభవిస్తున్నారు. పంచాయతీల్లోనూ, మండల పరిషత్ సమావేశాల్లో మహిళా సర్పంచులు, మహిళా ఎంపిటిసి సభ్యులు ఉన్న ప్రాంతాల్లో వారి భర్తలు పెత్తనం చెలాయిస్తూ మహిళలకు పరిపాలనపరమైన అవకాశాలు లేకుండా చేస్తున్నారు. రామచంద్రపురం మండలంలో 20 ఎంపిటిసి స్థానాలకు 12 స్థానాల్లో మహిళలు గెలుపొందారు. ఎనిమిది మంది పురుష ఎంపిటిసి సభ్యులున్నారు. 25 మంది సర్పంచులకు 12 మంది పురుషులు కాగా, 13 మంది మహిళా సర్పంచులు ఉన్నారు. ఆయా పంచాయతీల వద్ద గ్రామసభలు, ఇతర సభలకు, మండల పరిషత్ సమావేశాలకు మహిళా ప్రజాప్రతినిధుల స్థానాల్లో వారి భర్తలు హాజరవుతూ పెత్తనం చలాయిస్తున్నారు. పరిపాలనా పరమైన నిర్ణయాలు సైతం వారే తీసుకుంటున్నారు.

దీంతో రాజ్యాంగం మహిళలు కల్పించిన మహిళా సాధికారత ప్రశ్నార్థకంగా మారింది. రాజకీయంగా మహిళలు రాణించాలనే లక్ష్యంగా రాజ్యాంగం పలు అవకాశాలు కల్పించింది. నిబంధన 14 ఒకటి, వివక్ష నిర్మూలించేందుకు నిబంధన15, సమాన అవకాశాలకు నిబంధన 16, గౌరవానికి భంగం కలగకుండా నిబంధన 51ఎ వంటి పలు రక్షణ చట్టాలను ఏర్పాటు చేసింది. ఇవేమీ సక్రమంగా అమలు కావట్లేదు. మహిళలకు కల్పించిన మహిళా సాధికారత సక్రమంగా అమలు చేయాలని మహిళలు రాజకీయ రంగాల్లోనూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భర్తల పెత్తనం తగ్గించాలని కోరుతున్నారు. మండల సమావేశాలు మహిళా ప్రతినిధులు స్వయంగా హాజరయ్యేలా చూడాలని పలువురుకోరుతున్నారు.

యానాం వార్తలు

హెచ్‌ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో హెచ్‌ఐవి - ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సరెళ్ల వీరకుమార్, ఓలేటి దుర్గామహాలక్ష్మి హెచ్‌ఐవి, ఎయిడ్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎయిడ్స్ బారిన పడిన వారు తీసుకోవాల్సిన చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుధాకర్, జిల్లా యువజన అధికారి టి.గోపి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



దగ్ధమైన బోటును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి

దగ్ధమైన బోటు పరిశీలన

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు సావిత్రి నగర్ గ్రామానికి చెందిన కామాడి భైరవ స్వామి బోటును ఈ నెల 15 అర్ధరాత్రి గోదావరి ఒడ్డున గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేశారు. దీన్ని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్అశోక్, ఆర్ఎఒ మునిస్వామి పరిశీలించారు. ఘటన జరిగి వారమైనా ఎందుకు చర్యలు తీసుకోలేదని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడు కామాడి భైరవస్వామిని పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితుడికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారనాయకులు, పెద్దలు, యువకులు, ఎస్‌పి రఘునాయుగం, ఎస్ఐ నూకరాజు పాల్గొన్నారు.